క్లుప్తంగా

సుధాకర్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగంలో పరిశోధకుడు గోస్కు ల సుధాకర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పర్‌ఫార్మెన్స్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ ఏకేస్ స్టడీ ఆఫ్ వరంగల్ (రూరల్) డిస్ట్రిక్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సుధాకర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు జి.వీరన్న పర్యవేక్షణలో సుధాకర్ తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

నియామకం





నర్సింహస్వామి, నాగేశ్వర్‌రావు, నర్సింహరాములు

వరంగల్ లీగల్ : కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) అనుబంధ న్యాయవిభాగం రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా సీనియర్ న్యాయవాది పోరండ్ల నర్సింహరాములును నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు స్వామినాథ్ జైస్వాల్‌జీ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బుద్ధారం మురహరి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సూరం నర్సింహస్వామి, కొంతం నాగేశ్వర్‌రావులను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లాశాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం జనతా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కంచర్ల సుధీర్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కిరణ్‌కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రవీందర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్వేతార్కుడు




కాజీపేట : స్థానిక స్వయంభు శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో శుక్రవారం రాత్రి ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే



హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి-నీలిమారెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా కలిసి శుక్రవారం మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ సాంప్రదాయ పద్ధతిలో పూజారులు స్వాగతం పలికారు.

ఏటూరు జ్యోతికి నివాళి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇటీవలనే మృతి చెందిన ప్రొఫెసర్ ఏటూరు జ్యోతికి శుక్రవారం క్యాంపస్‌లోని గ్రంథాలయంలో జ్యోతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

లోఓల్టేజీ సమస్య నివారణకు చర్యలు

హసన్‌పర్తి : 55వ డివిజన్‌లో విద్యుత్ లోఓల్టేజీ సమస్య నివారణకు చర్యలు తీసుకున్నట్లు కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. 55వ డివిజన్ భీమారంలోని యాదవనగర్‌లో కొత్తగా ఏర్పాటు విద్యుత్ లైన్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు.

వంతెన నిర్మాణం ఎప్పుడో?

- నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు
- వర్షాకాలం వస్తే రాకపోకలు బంద్
- పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికుల డిమాండ్



నడికూడ-గొల్లపల్లి గ్రామాల నడుమ రోడ్యాం

నడికూడ : వర్షాకాలం వచ్చిందంటే నడికూడ-గొల్లపల్లి గ్రామాల మధ్య ప్రయాణించేందుకు వాహనదారులకు ఇబ్బందులు తప్పేలా లేదు. ఇరు గ్రామాల మధ్య గల రోడ్యాం దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందేనని స్థానికులు వాపోతున్నారు. దాదాపు పది సంవత్సరాల క్రితం రెండు పైపులైన్లు వేసి వంతెన నిర్మించి వెంకటయ్య చెరువు మత్తడి పోస్తే నీరు పారేలా చేసి వదిలేశారు. కానీ పైపుల్లో మట్టి కూరుకుపోవడంతో మత్తడి పోస్తే రోడ్యాంపై నీరు నిత్యం ప్రవహిస్తూ పాకురు పేరుకుపోయి జారుడుబండలా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటుగా ప్రయాణించాలంటే భయాందోళన తప్పడం లేదని వాపోతున్నారు. పలుమార్లు ప్రమాదాలు జరుగగా పలువురు ఆస్పత్రుల పాలైన సంఘటనలు ఉన్నాయని అంటున్నారు.

వర్షాకాలంలో రాకపోకలు బంద్

మండల కేంద్రం నుంచి వరంగల్, హనుమకొండకు వెళ్లాలంటే సుమారు 14 కిలో మీటర్లు అధనంగా ప్రయాణించాల్సి వస్తోంది. వర్షాకాలంలో వారం రోజుల వరకు వరద ప్రవహిస్తే పూర్తిగా రాకపోకలు నిలిచిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా గొల్లపల్లి, ధర్మారం గ్రామస్తులకు నిత్యావసర సరుకులతో పాటు తాగునీరు కూడా మండల కేంద్రం నుంచి తీసుకెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో రోడ్యాం నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు నడికూడ-గొల్లపల్లి గ్రామాల నడుమ ఉన్న రోడ్యాం సమస్య గురించి అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ 2.కోట్ల 30 లక్షల అంచనా వ్యయంతో రోడ్యాంపై నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదన చేసినట్లు మాజీ సర్పంచ్ తెలిపారు. కానీ టెండర్ల ప్రక్రియ చేపట్టకపోవడంతో వంతెన నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. అయితే ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తైనప్పటికీ సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వర్షాకాలం వస్తే తమకు రావాణా కష్టాలు తప్పవని, ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పందించి త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షాకాలంలోపు పూర్తిచేయాలి



నడికూడ-గొల్లపల్లి గ్రామాల నడుమ ఉన్న రోడ్యాం సమస్య గత కొన్ని సంవత్సరాల నుంచి ఉంది. వర్షాకాలం వచ్చిందంటే అటువైపు వెళ్లడం సాధ్యపడదు. అత్యవసరం ఏర్పడితే ఇబ్బంది తప్పదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

– రవీందర్‌రావు, మాజీ సర్పంచ్, నడికూడ

ఎమ్మెల్యే రేవూరికి కృతజ్ఞతలు..



నడికూడ-గొల్లపల్లి గ్రామాల నడుమ గల రోడ్యాంపై నూతన వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరు అయ్యాయి. ఇటీవల కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు వచ్చారు. ఎమ్మెల్యే రేవూరి సహకారానికి కృతజ్ఞతలు.

– కుమారస్వామి, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపూర్ : మండలంలోని శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ రాములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడో శనివారం సందర్భంగా శనిగరం, గూనిపర్తి సబ్ స్టేషన్లలో మెయింటెనెన్స్, మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని శనిగరం, గోపాల్‌పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల, గూనిపర్తి, మాదన్నపేట, శ్రీరాములపల్లి, అంబాల గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతులు, గృహ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

గ్రామానికి సరిహద్దులు ఏర్పాటు చేయాలి



ఆత్మకూరు : తమ గ్రామానికి సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని కటాక్షపూర్‌కు చెందిన పలువురు దళితులు శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. అంత్యక్రియలు జరిపే విషయంలో తమ సమీప గ్రామం హౌజ్‌బుజుర్గు గ్రామస్తులతో విభేదాలు వస్తున్నాయని, వెంటనే సరిహద్దు ఏర్పాటు చేయాలని వినతిలో పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



సంగెం : మండలంలోని తిమ్మాపూర్‌లో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికులు చిన్నపాక రాములు, రాకేశ్ ఆధ్వర్యంలో మెడికేర్ ఆస్పత్రి వైద్యులు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వంశి, రాము, సాయితేజ, మేఘన, పుష్పనీల 235 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సుమారు రూ.72 వేల విలువైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బుక్క మల్లయ్య, వేల్పుల కుమారస్వామి, మాదినేని రాంరెడ్డి, గన్ను సంపత్, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, యూత్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల కార్యవర్గం నియామకం



కమలాపూర్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మాదన్నపేటకు చెందిన కత్తి రమేశ్, పట్టణ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఎడ్ల వెంకటేశ్వర్లు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నేరెళ్లకు చెందిన కొండం శ్రీనివాస్‌యాదవ్ నియామకమైనట్లు ఆ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదేశానుసారం ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం నూతనంగా నియామకమైన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



ఎల్కతుర్తి : ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో ఇటీవలే మృతిచెందిన పలు బాధిత కుటుంబాలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరామర్శించారు. ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్, జగన్నాథపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామంలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను ఓదార్చారు. అండగా ఉంటానని భరోసా కల్పించారు. అంతకు ముందు జైఇన్‌ఎస్‌ఎస్‌యూఐ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు ఇంద్రసేనారెడ్డి, సుకినె సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, అంబాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే బీఆర్‌ఎస్ విమర్శలు

నర్సంపేట : రాజకీయ దురుద్దేశంతోనే స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిపై బీఆర్‌ఎస్ నేతలు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. గతంలో తెచ్చిన నిధులతో ఎమ్మెల్యే మాధవరెడ్డి అభివృద్ధి పనులు చేస్తున్నాడని ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. బీఆర్‌ఎస్ హయాంలో నిధులను దుర్వినియోగం చేసి అభివృద్ధి విస్మరించారని సుదర్శన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యేకు, బీఆర్‌ఎస్ నాయకులకు పట్టణ అభివృద్ధిపై మాట్లాడే హక్కు లేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పద్ధతి మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మిషన్ భగీరథ పేరుతో ధ్వంసం చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో పట్టణంలోని అన్ని వార్డుల్లో మరమ్మతులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. అసత్య ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

స్థానిక పోరులో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి.. ఈ మేరకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం నిడిగొండ సత్యసాయి గార్డెన్స్‌లో మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలు అమలులోకి రానున్నాయని, లబ్ధిదారుల ఎంపికలో నాయకులు, కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణం, 100 పడకల ఆస్పత్రి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, డిగ్రీ కళాశాల మంజూరు చేయించానని, ఈ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి రెండో వారంలో శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ.. బీజేపీ-బీఆర్‌ఎస్ మధ్య జైలు, బెయిల్ బంధం కొనసాగుతున్నదని, ఈ రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దెబ్బతీయటానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్ముూరి ప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్లు శివరాజ్‌యాదవ్, లావణ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిర, వంశీధర్‌రెడ్డి, క్రాంతికుమార్, నర్సింహారెడ్డి, రవీందర్‌జీ, లింగాజీ పాల్గొన్నారు.

బావిలో నీటి తొలగింపు.. క్లోరినేషన్

శాయంపేట: మండలంలోని కొప్పుల గ్రామం దళిత కాలనీలోని బావిలో శుక్రవారం పంచాయతీ సిబ్బంది నీటిని తొలగించి క్లోరినేషన్ చేపట్టారు. కాగా ఏడాదిగా బావిలోని నీరు పాకురు పట్టి వాసన వస్తోంది. గురువారం పథకాల కోసం అర్హులను ఎంపిక చేసేందుకు సర్వేకు వచ్చిన ఎంపీడీఓ ఫణిచంద్రను దళిత కాలనీవాసులు నిలదీసిన విషయం పాఠకులకు విదితమే. దీంతో స్పందించిన ఎంపీడీఓ బావి క్లోరినేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శి అనూషను ఆదేశించగా.. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుకర్, ఏఈ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి అనూష ఆధ్వర్యంలో జీపీ సిబ్బంది బావిలో నీటిని తొలగించారు. క్లోరినేషన్ చేసి పగిలిన పైపులను తీసేసి నీరు లీకవకుండా కొత్త పైపులు అమర్చారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే ఎమ్మార్పీఎస్ ధ్యేయం

సంగెం : ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయంగా మరింత పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేశ్, జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రదర్శన సందర్భంగా వారు మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'వేల గొంతులు-లక్షల డప్పుల మహా ప్రదర్శన'ను విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల 20న హనుమకొండలోని వేయి స్తంభాల గుడి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించనున్న డప్పు కళాకారుల సన్నాహక కళా ప్రదర్శనకు తరలిరావాలని కోరారు.

బడి బయటి పిల్లల గుర్తింపునకు సర్వే

హసన్‌పర్తి : బడి బయటి పిల్లల గుర్తింపునకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో సీఆర్పీలు బడి బయట ఉన్న పిల్లల వివరాలు సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఇంటింటికి వెళ్లి పిల్లల వివరాలు సేకరిస్తున్నారు. పాఠశాలకు నెల రోజుల పాటు రెగ్యూలర్‌గా హాజరుకాని విద్యార్థులను డ్రాప్‌అవుట్‌గా గుర్తించి వారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఆ వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. బడీడు పిల్లలతో పనిలో కుదుర్చుకుంటే జైలుకు పంపుతామని మండల విద్యాశాఖ అధికారి రవీందర్ హెచ్చరించారు. ఇప్పటి వరకు 30 మంది పిల్లలను బడిబయట ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పిల్లల దృష్టి చదువుపై మళ్లించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు. చదువుకుంటే వచ్చే ప్రయోజనాలను వివరించి వారిని బడికి పంపించాలని అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ నాగరాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తే కేసులు



ఆత్మకూరు : స్వాధీనం చేసుకున్న బియ్యం, నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు



కమలాపూర్ : పట్టుకున్న రేషన్ బియ్యం, మిషన్లతో పోలీసులు

ఆత్మకూరు : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తే కేసులు తప్పవని సీఐ సంతోశ్ హెచ్చరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పోలీస్ సిబ్బంది చౌల్లపల్లి గ్రామ శివారులో గల కోళ్లఫారం వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా పెద్దాపూర్ గ్రామం నుంచి రేషన్ బియ్యం ట్రాలీలో లోడ్ చేసుకొని మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తూ తారసపడింది. దీంతో ట్రాలీని తనిఖీ చేయగా మండలంలోని దుర్గంపేటకు చెందిన పురాణం రమేశ్, ములుగు జిల్లా మల్లంపల్లికి చెందిన కొండపల్లి కుమార్ వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన 70 బస్తాల బియ్యాన్ని ట్రాలీలో లోడ్ చేసుకొని వెళ్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.60 వేల విలువచేసే 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపూర్ : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. మండలంలోని అంబాలలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో బోయిని సాయిలు అక్రమంగా తన ఇంటి ఆవరణలో తడిపి ఆరబోసిన సుమారు 14 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు రెండు వేయింగ్ మిషన్లు (తూకం వేసే యంత్రాలు) స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన రేషన్ బియ్యంతో పాటు రెండు వేయింగ్ మిషన్లను సీజ్ చేసి సాయిలుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, ఎస్సై దిలీప్, స్థానిక హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్ భాస్కర్, టాస్క్‌ఫోర్స్ పాల్గొన్నారు.

మద్యంషాపులను తొలగించాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



ఎక్సైజ్ సీఐ తాతాజీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్, కొప్పుల గ్రామంలోని శ్రీసాయి వైన్స్‌లు రోడ్డుకిరువైపులా ఉండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తొలగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీకి వినతిపత్రం అందించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. వైన్ షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రోడ్డుపక్కనే కొనసాగిస్తుండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండలంలో అధిక సంఖ్యలో బెల్ట్‌షాపులు వెలిశాయని, వైన్‌షాపుల యజమానులు బెల్ట్‌షాపుల నిర్వహణకు ప్రోత్సహిస్తూ అధిక ధరలకు మద్యం తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారని వినతిలో ఆరోపించారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం షాపులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వినతిలో హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్, బొచ్చు ఈశ్వర్, గణేశ్, పవన్ తదితరులు ఉన్నారు.

ఐనవోలు మల్లన్న హుండీ లెక్కింపు

- సమకూరిన ఆదాయం రూ.1.8 కోట్లు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ, పరిశీలకుడు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ పరిశీలకులు డి.అనిల్ కుమార్ పర్యవేక్షణలో శుక్రవారం హుండీ లెక్కించారు. 2024 అక్టోబర్ 16 నుంచి 2025 జనవరి 17 వరకు 91 రోజులకుగాను హుండీల్లో రూ.31,59,335, వివిధ ఆర్జిత సేవా టికెట్ల ద్వారా రూ.1,48,67,173లు రాగా.. మొత్తం రూ.1,80,26,508ల నగదు సమకూరినట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.15,40,895 ఆదాయం పెరిగినట్లు ఈఓ తెలిపారు. హుండీల్లో లభ్యమైన వెండి, బంగారాన్ని యథావిధిగా అందులోనే వేసి సీల్ వేసినట్లు తెలిపారు. లెక్కింపులో కానిస్టేబుళ్లు పి.రమేశ్, రాజ్‌కుమార్, మండల ఆర్ఐ ఆర్.సంధ్య, అర్చక సిబ్బంది, ఒగ్గు పూజారులు, మహబూబాబాద్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సేవా సమితి సభ్యులు, దేవాలయ అర్చక, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంతవరకు బీఆర్‌ఎస్‌లోనే..

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

వేలేరు : ప్రాణం ఉన్నంతవరకు బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతానని, కేసీఆర్ సారథ్యంలో పనిచేస్తానని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని షోడాషపల్లి గ్రామంలో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొంతమంది నాయకులు పనిగట్టుకుని తాను పార్టీ మారుతున్నానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి ఉంటానని అన్నారు. వేలేరు మండలానికి సాగునీరు తీసుకువచ్చింది బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమేనని, ఇప్పుడు కడియం శ్రీహరి అబద్ధపు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. చిల్పూర్ దేవాలయానికి రూ.10 కోట్లు తాను ఇప్పించానని, కానీ కడియం శ్రీహరి ఇప్పించానని చెప్పుకోవడం హాస్యాస్పదం అన్నారు. కేసీఆర్ చొరవతోనే వేలేరు, చిల్పూర్ మండలాలు ఏర్పాటు అయ్యాయని, ఘన్‌పూర్ మున్సిపాలిటీకి, నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజీ, వంద పడకల ఆస్పత్రి ఏర్పాటును అడ్డుకున్నది కడియం శ్రీహరి అని ఆరోపించారు.

రెవెన్యూ రికవరీ చట్టం లోపభూయిష్టం

- సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్

ఖిలా వరంగల్: బ్రిటీష్‌కాలంలో ఏర్పాటైన ఆర్.ఆర్ (రెవెన్యూ రికవరీ) చట్టం లోప భూయిష్టమైందని, దీన్ని సవరణ చేసి ఉద్దేశపూర్వక ఎగవేతదారులు, సహకరించే అధికారులపై కేసులు నమోదు చేయాలని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ కోరారు. శుక్రవారం శివనగర్‌లోని రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యాలయంలో సీనియర్ న్యాయవాదులు మురారిశెట్టి యశ్వంత్‌కుమార్, రాజేష్‌కుమార్ అధ్యక్షతన వినియోగదారులు లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశం జరిగింది. చట్టపరంగా త్వరితగతిన, కఠినమైన చర్యలు, ప్రజాధన దుర్వినియోగ బాధ్యుల నుంచి ప్రభుత్వం రికవరీ చేసే విధానాల్లో చేయాల్సిన మార్పులు చేర్పులపై చర్చించారు. రెవెన్యూ రికవరీ చట్టాన్ని వెంటనే సవరించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం వరంగల్ జిల్లాలోని 37 రైసు మిల్లుల వివరాలను ఆయన న్యాయవాదులకు అందజేశారు. ఈ సమావేశంలో న్యాయవాదులు ఆనందరావు, భిక్షపతి, అనిల్‌కుమార్, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

2 రోజులు తాగునీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్ : వరంగల్ ప్రతాపరుద్ర దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లో పైపులైన్ల లీకేజీల మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు, రేపు (శని ఆదివారాల్లో) నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈఈ రామోజు శ్రీనివాస్ తెలిపారు. సహకరించాలని కోరారు.